# నాకు నచ్చిన నా కథ

కథలు ఎలా పత్రికలకు పంపాలో కూడా తెలియని దశలో వ్రాయటం ప్రారంభించాను. కేవలం వ్రాయకుండా ఉండలేని ఒక బలహీనతతో వచ్చీరాని వయసులో నా మనసులో అల్లిబిల్లిగా అల్లుకొనే భావాలకు ఒక ఆకృతి నిచ్చి డ్రాయర్‌లో పడేసేదానిని. ఆ కథలు చదివిన నా స్నేహితురాలు అంబ మొదటిసారిగా ఒక కథ తానే ఫెయిర్‌చేసి, తానే డబ్బుకూడా ఖర్చుపెట్టి రిజిస్టర్ పోస్ట్‌లో పంపింది. (బుక్‌పోస్ట్‌లో పంపొచ్చనికూడా అప్పట్లో మాకు తెలీదు.) అలా నా మొదటి కథ "ఆటు-పోటు" అచ్చయింది. ఆ తరువాత కొంత కాలం వ్రాయటం మానినా 63 నుంచీ రెగ్యులర్‌గా వ్రాస్తూనే ఉన్నాను. ఇప్పటికీ రచయిత్రిగా నేను సాధించగలిగింది సాధించానన్న తృప్తి నాకు లేదు. ఇంకా, ఇంకా ఏదో అన్వేషణ- చుట్టూ ఉన్న జీవితాన్ని పరిశీలించటం ఒక యెత్తూ- జీవితపు లోతులను తరచిచూడటం మరో యెత్తూ-రెండింటి సమ్మేళనమూ అవసరమని అనుకున్నా, రెంటిలో ఒకటి ఉన్నా కొంత తృప్తిపడతాను. నా చేతికి దెబ్బ తగిలినపుడు, నాకు సేవచేసిన మా పనిమనిషి "నరస" కారణంగా నేను అర్థం చేసుకోగలిగిన సమాజంలోని ఒక భాగానికి ప్రతిబింబం ఈ కథ కావటంవల్ల ఇదంటే నాకు ప్రత్యేకమైన ఇష్టం.

—ఆనందారామం

# బుుణగ్రస్తులు

"లచ్చీ! ఆ పది పైసలిట్టాతె! స్టీలు దుకాణంలో జమకడితే క్యార్డులో రాస్తాడు."

"వద్దే అమ్మా! పల్లీపట్టీ కొనుక్కుంటానే!"

ఏడేళ్ళ లక్ష్మి పదిపైసల బిళ్ళ గట్టిగా పట్టుకుని, ప్రాణప్రదంగా దాచుకుని ఎలాగైనా తల్లిని ఒప్పించుకుని పల్లీపట్టీలు కొనుక్కు తినాలని తాపత్రయ పడుతోంది. నరసమ్మ ఎలాగైనా లక్ష్మికి నచ్చచెప్పి ఆ పదిపైసలూ లాటరీ సిస్టమ్‌లో స్టెయిన్‌లెస్‌స్టీల్ సామానులమ్మే దుకాణంలో కట్టాలని చూస్తోంది. నరసమ్మ పనిచేసుకునే మనిషయినా చాలాకాలంగా నా దగ్గర మెలగటంవల్లనేమో "బొంచను" "కాల్మొక్కుత" లాంటి మాటలు వాడుతూ యాసలో

మాట్లాడదు. కానీ కొన్ని కొన్ని మాటలు గమ్మత్తుగా పలుకుతుంది. "లక్ష్మి" అనటానికి లచ్మీ అంటుంది. కార్డ్ అనడానికి క్యార్డ్ అంటుంది.

ఈ క్యార్డ్ సంగతి ఉత్సాహంగా నాకు చెప్పింది నరసమ్మ ఇదివరలో....

ఆ షాపు యజమాని తన వస్తువుల అమ్మకానికి ఒక విచిత్రమైన పథకాన్ని కనిపెట్టాడు. బీదా, గొప్పా భేదం లేకుండా అందరూ అతని షాపులో కార్డ్సు తీసుకోవచ్చు. అయిదు పైసలయినా, పది పైసలయినా ఎంత ఉంటే అంత షాపులో జమకట్టుకోవచ్చు. వెంటనే అలా జమకట్టినట్లు కార్డులో వ్రాస్తాడు. అలా నూరు రూపాయలు జమ అయ్యేవరకూ కట్టాలి. ఈలోగా ప్రతి నెలా లాటరీవేస్తాడు. లాటరీలో వస్తే పూర్తి డబ్బు కట్టక్కర్లేకుండానే అంతవరకు కట్టిన డబ్బుకి అయిదురెట్లు ఖరీదుగల వస్తువు తీసుకోవచ్చు, లాటరీ రాకపోతే నూరు రూపాయలు జమకాగానే నూరు రూపాయల ఖరీదుగల వస్తువులు తీసుకోవచ్చు.

"మీ అదృష్టం బాగుంటే లాటరీ వస్తుంది. లేకపోతే మీ డబ్బు మీకొస్తుంది స్టీలు సామానురూపంలో. మీకేం నష్టం లేదు." అది షాపు యజమాని ప్రచారం.

మొదట్లో నరసమ్మ ఈ కార్డులమీద అంత మోజు చూపించలేదు. కానీ, ప్లీడర్‌గారింట్లో పనిచేసే సీతమ్మకి రెండు నెల్లు, రెండయిదులు కట్టగానే యాభై రూపాయలు ఖరీదుచేసే స్టీల్ కంచం వచ్చిందనేసరికి దీనికి ఆశ పుట్టుకొచ్చింది. ఎవరి అదృష్టమెలా ఉంటుందోనని పిల్లలు ముగ్గురి పేర్లమీద మూడుకార్డులూ, తన పేరుమీద ఒక కార్డు మొత్తం నాలుగు కార్డులు తీసుకుంది. నన్నూ తీసుకోమంది. నేను నవ్వి, "నా కిలాంటి అదృష్టాలక్కర్లేదే! నీకు పట్టే అదృష్టం చూస్తానులే!" అన్నాను.

దొడ్లో లక్ష్మి తల్లికందకుండా తప్పించుని పారిపోవాలని చూస్తోంది.

"నీకు స్టీలుకంచం అక్కర్లేదూ? పెద్దది- మంచిది- మెరిసేది...." కూతుర్ని ప్రలోభపెట్టాలని చూస్తోంది నరసమ్మ....

లక్ష్మి చివరకు లొంగిపోయింది.

"నాకు పొడుగుగా వుండే కంచం కావాలి! అమ్మగారు తినేలాంటి కంచం...." ఆశగా అంది లక్ష్మి, అప్పటికీ పదిపైసల బిళ్ళ గట్టిగా పట్టుకుని....

నరసమ్మ పకాలున నవ్వి— 'ఓసినీ! నీ చూపు అమ్మగారి కంచంమీద పడిందీ! సరే అలాంటిదే వస్తుందిలే! ఆ పదిపైసలియ్యి.... షాపులో కడతా!'.... అంది.

లక్ష్మి వదల్లేక, వదల్లేక తన చేతిలో పదిపైసల బిళ్ళ తల్లిచేతిలో పెట్టింది. అది చూసి కిట్టుగాడు తనే తల్లి దగ్గరకొచ్చి "నాకు పలకల గ్లాసు కావాలి. అమ్మగారు పాలు ఇస్తే అందులో తాగుతా, సత్తుగ్లాసులో తాగను" అన్నాడు. నరసమ్మ వాడిని మురిపెంగా చూసుకుంటూ, ముద్దుగా నవ్వి "నీకు పలకల గ్లాసే వస్తాదిలేరా, మరి నీ ఐదుపైసలు కూడా ఇయ్యి" అంది బెల్లిస్తున్నట్టు. కిట్టుగాడు ఏమాత్రం సంకోచించకుండా తన అయిదు పైసలూ తల్లి చేతిలో పెట్టేశాడు.

ఇదంతా చూస్తున్న నాకు ఎలానో అనిపించింది. "నరసమ్మా" అని పిలిచాను.

"లేచారా అమ్మగారూ" అని నరసమ్మ పరుగుపెడుతున్నట్లుగా నా దగ్గరకు వచ్చి, బ్రష్‌మీద టూత్‌పేస్ట్ వేసి నాకందిస్తూ "ఇయ్యాల తొరగా లేచిపోయారు" అంది.

ఆ బ్రష్ అందుకుని, "ఎందుకు పసిపిల్లల్ని అలా ఏడిపిస్తావు? ఆ పైసలు పెట్టి వాళ్ళకు కావలసింది కొనుక్కోనియ్యరాదూ!" అన్నాను.


"అయితే, అంతా విన్నారన్నమాట. పొట్టకి తింటే ఏటొస్తాదమ్మా? ఎంత తింటే ఎపుడు చూసాడు? ఏం తింటే గడవదూ? స్టీల్ సామానులొస్తే...."

దాని కళ్ళు ఆశతో తళతళలాడుతున్నాయి. నాకు నరసమ్మలో ఇదే ఇష్టం. ఎలాంటి పరిస్థితుల్లోనూ నిరాశతో కృంగిపోదు సరికదా, ఎప్పటికప్పుడు ఎలాగో సరికొత్త ఆశను ఊపిరిపోసుకుని జీవితాన్ని ఉత్సాహంతో నింపేసుకుంటుంది.

నలుగురి పిల్లల్ని కన్నాక నరసమ్మ మొగుడికి నరసమ్మలో అనాకారితనం కనిపించింది. పురోదాన్ని లేవదీసుకుపోయాడు.

"పాపిష్టోడు నలుగుర్ని కన్నాడు. ఇంకా అందమెక్కడ చస్తాదమ్మా? చిన్నతనంలో ఎట్టా వుండేదాన్నో మా అమ్మ నడగండి. ఎర్రిముండని ఊడంటే ఎంత పడిచచ్చేదాన్ని" అని కన్నీళ్ళు పెట్టుకుని, అంతలో కళ్ళు తుడుచుకుని నవ్వుతూ, "ఆడే అనుభవిస్తాడులేమ్మా, నాకేం? రత్నాలలాటి నలుగురు బిడ్డలు. రాజాల్లా పెంచుకుంటాను. ఎప్పుడో ఆడేవస్తాడు నా కాళ్ళకాడికి. అప్పుడు...." అని తన మొగుడు తిరిగొస్తే క్షమించాలా, వద్దా అని ఆలోచిస్తూ నిలబడిపోయేది....

మొగుడు వదిలేశాక నరసమ్మ తన దురదృష్టాన్ని తిట్టుకుంటూ ఏడుస్తూ కూచోలేదు. మనసులో ఏముందేదో పైకిమాత్రం నవ్వుతూ తిరిగేది. యంత్రంలా పనిచేసేది. బీడీలు చుట్టటం, కల్లుపాకల దగ్గర ఆలుబజ్జీలూ,




పచ్చిమిరపకాయ బజ్జీలూ అమ్మటం ఇలా ఏ పనంటే ఆ పని చేసేది. నా స్నేహితులెవరో నమ్మకస్థురాలని దాన్ని నా దగ్గర పనికి కుదిర్చారు. అప్పటి నుండీ పిల్లలతో నేనిచ్చిన రెండుగదుల సర్వెంట్ క్వార్టర్స్‌లో నా ఇంట్లోనే ఉంటున్నా, అవకాశం దొరికినప్పుడల్లా ఏదో ఒక పనిచేసి డబ్బు సంపాదించాలనే ప్రయత్నించేది. డబ్బు సంపాదించాలని ఇంత ఆశ వున్నా దానిలో ఏ కోశానా దొంగతనమున్నది లేదు. పాటుపడి పిల్లలిని ప్రయోజకులిని చేయాలన్న ఆరాటమే. అందుకే అదంటే గౌరవం నాకు.

ముఖం కడుక్కోగానే పళ్ళరసంలో తేనె కలిపి అందించి, "స్నానానికి నీళ్ళు సిద్ధంచేశానమ్మా" అంది.

నేను రోజూ చాలా ఆలస్యంగా నిద్రలేస్తాను. ఏ రోజయినా ఎనిమిదింటికి నిద్ర లేస్తే, అది చాలా పెందలాడే లేచినట్లు. బాస్ వెళ్ళమన్న చోటికి వెళ్ళి, నా 'కళాత్మక ప్రతిభ' నంతా ప్రదర్శించి, ఆ 'ప్రముఖ వ్యక్తులిని' మెప్పించి ఇంటికి చేరుకునేసరికి తుక్కయిపోయినట్టు ఫీలవుతాను. బాస్ ఫోన్‌కాల్ అందుకుని ఇల్లువదిలి, మళ్ళా ఇల్లు చేరుకునేవరకూ నేను నేను కాను. బాస్ ఆజ్ఞ ప్రకారం ఆ 'ప్రముఖుణ్ణి' అలరించాలన్న దొక్కటే నా ఏకాగ్రమైన తపసు, ఇక మరే ఆలోచనలూ వుండవు. కానీ, ఇల్లు చేరుకున్న తర్వాత మాత్రం నేను నాకే ఏదో బోలుగా అనిపిస్తాను. నాలోనుంచి అత్యంత ప్రధానమయినదేదో అదృశ్యమయి, ఒక తోలుబొమ్మ మిగిలినట్లు అనిపిస్తుంది. మనసు

కేమాత్రమూ ఇష్టంలేని పనిచేసినపుడు శరీరానికి కలిగే శ్రమంతా, ఒకటికి పది రెట్లుగా ఇంటికి చేరుకోగానే ఆవరించుకుంటుంది. జవసత్వాలు పూర్తిగా నశించినదానిలా పక్కమీద పడిపోతాను. అప్పుడయినా నాకే ఆలోచనలూ రావు. ఆలోచించడం మానేసి చాలారోజులయింది నేను. ఆలోచించటం మొదలుపెడితే నిద్ర పాడవుతుంది. నిద్ర పాడయితే నా అందం పాడవుతుంది. అందం పాడయితే అందంమీద ఆధారపడి బ్రతికే నా బ్రతుకు పాడవుతుంది. అందుకే ఆలోచించటం మానేసి ఉక్కిరిబిక్కిరిగా బ్రతికెయ్యటం నేర్చుకున్నాను. నా నిత్యకృత్యాలన్నింటిలో స్నానం నాకు చాలా ఇష్టం. బాత్‌టబ్‌లో సమపాళ్ళలో నీళ్ళు తోలిపి, అందులో సెంట్ కలిపి సిద్ధంచేసి ఉంచుతుంది నరసమ్మ. నా శరీరం ఆ నీళ్ళలో ఉన్నంతవరకూ నా ప్రాణానికెంతో హాయిగా ఉంటుంది. ఆ నీళ్ళు పవిత్రగంగాజలం కాదు—నా పాపాలను అవి ప్రక్షాళనం చెయ్యలేవు. ఆ మాటకొస్తే నేనేదో పాపం చేస్తున్నాననీ అనుకోవటం లేదు. కానీ స్నానం చేస్తున్నంతసేపూ శరీరంపై ఉన్న మురికితోపాటు మనసులో ఉన్న చీదర కూడా కడుక్కుంటున్నట్లుగా అనిపిస్తుంది నాకు. ఆ మురికి, ఈ చీదరా మళ్ళీమళ్ళీ చేరతాయి. అది తెలుసు నాకు. కానీ ఎప్పటి కష్టసుఖాలు అప్పటివే! ఎంతోమంది నాకు హాట్‌డ్రింక్స్ అలవాటు చెయ్యాలని చూశారు. నేను చీదరించుకుని వద్దనలేదు. ఇచ్చినదంతా గడగడ త్రాగేశాను. చిత్రం! ఆ మధువు నా కెలాంటి మైకాన్నీ కలిగించలేదు. మధువును మించిన శక్తితో నా మనసును నేనే దేనికీ అందని మైకపు మత్తులో జోకొట్టడం కారణమా? లేక ఆ మధువు నా శరీరంపైన ఏ విధమయిన ప్రభావమూ కలిగించలేనంత విరక్తి నా మనసులో ఉండటం కారణమా? ఏదీ నిర్ణయించుకోలేకపోయాను. ఏమైనా నా మనసులో చీదర పోగొట్టగలిగే శక్తి మధువుకు లేదని తేలిపోయింది. నా మనసుకు చికాకు కలిగినప్పుడల్లా నేను మరోసారి స్నానమే చేస్తాను.

నా స్నానం పూర్తయ్యేసరికి తువ్వాలుతో సిద్ధంగా ఉంది నరసమ్మ. నరసమ్మ ఎంత మంచిది? ఒక్కనాడయినా ఏ పనీ మరిచిపోదు. దేనికీ బద్ధకించదు. నా తల నేను తుడుచుకోగలను. కానీ మరొకళ్లు తుడుస్తుంటే అదొక విధమయిన హాయి! ఈ రకమయిన చిన్నచిన్న సౌఖ్యాలన్నా అనుభవించలేకపోతే, నేనెందుకింత కష్టపడి సంపాదిస్తున్నట్లు?

నరసమ్మ తల తుడిచి సాంబ్రాణీపొగ వేసింది. జుట్టు ఏ మాత్రం చిక్కులు

పడకుండా చాకచక్యంగా చిక్కుతీసి వదులుగా జడవేసి "ఫలహారం ఏం చెయ్య మంటారమ్మా ?" అంది.

"ఫలహారం సంగతి తరువాత చూద్దువుగాని, ముందు నేను నీ కోసం తెచ్చిన బహుమానం చూడు !" అని నేను తెచ్చిన దుద్దులపెట్టి దానిచేతికి అందించాను. అది కుతూహలంతో పెట్టె తెరిచి చూసి "దుద్దులు ! ఎంత బాగున్నయో ! బంగారవయ్యే !" అంది.

"నీ మొహం ! బంగారంవి కాకపోతే, రోల్డ్‌గోల్డువి నీ కిస్తాననే ?"

"దుద్దులు, బంగారం దుద్దులు ! ఓలమ్మో ! ఈ జన్మకి మళ్ళీ చెవులికి దుద్దులు పెట్టుకుంటాననుకోలేదు. తులం బంగారం చక్కని దుద్దుల ఆ మార్వాడీ వెధవ పొట్టన బెట్టుకున్నాడు. అవసరానికి తాకట్టుపెట్టి అప్పు తెచ్చు కున్నాను. తాకట్టు పెడతా వుంటేనే యేడుపొచ్చింది. సర్లే, మళ్ళీ యిడిపించు కుంటాగందా అనుకున్నాను. మిత్తికట్టాను. అమ్మగారూ ! అర్నెల్లలో కడుపు కట్టుకుని అడి దబ్బు ఆడికి తీసికెళ్ళి నా దుద్దులియ్యమన్నాను. ఈడలేవు అడున్నాయి, ఆడలేవు ఈడున్నాయి అంటూ మరో అర్నెలు, మరో అర్నెలు తిప్పించిండు. చివరికి అన్ని రోజులకీ మిత్తికట్టి దుద్దులు మింగేసాడు. ఎదురు నువ్వే నా కియ్యాలన్నాడు. ఏడుస్తా దుమ్మెత్తిపోశానమ్మగారూ ! ఆడికి సిగ్గా ? శరమా ? మంది నోళ్ళు కొట్టి, మిద్దెలు కట్టాడు. ఎట్టొచ్చాడమ్మగారూ ఇక్కడికి ? పొట్టచేతబట్టుకుని, చిన్న అంగడి తెరిచాడు. ఆల్లనీ, ఈల్లనీ ఊరగాయ ముక్కడిగి పాసిపోయిన మెతుకులతో పొట్ట నింపుకునేవాడు. ఇప్పుడు చూడండి ఎంత పెద్ద బంగ్లా కట్టిందో ! మా అనుమంటోళ్ళ నెత్తురు తొన్లేనమ్మగారూ ఆ మేడంతా. సచ్చినోడు ! ఇంతకింత అనుభవించడంటారా, అమ్మగారూ !"

నరసమ్మ ఈ దుద్దులకథ నేను ఇదివరలో చాలాసార్లు విన్నాను. చెప్పిందే చెపుతూ అది తన దుఃఖగాథలన్నీ నాతో ఏకరువుపెట్టక మానదు. అది చెప్పిందే చెప్పినా, నేను ఎప్పటికప్పుడు శ్రద్ధగానే వింటాను. దాని చిట్టచివరి ప్రశ్న కేమయినా సమాధానం దొరుకుతుందేమోనని.... అయినా ఇంతవరకూ నాకే సమాధానం దొరకలేదు. చేసిన పనులకు ఈ లోకంలోనే అనుభవం ఉంటుందా? అలా ఉండకపోతే ఈ సృష్టికి సమన్వయం ఏ రకంగా సాధ్యమవుతుంది? ఇంతటి అత్యద్భుత సృష్టి కార్యకారణ సంరంభాలతో నిమిత్తంలేని భౌతిక ప్రక్రియ మాత్రమేనా ?

చెవులకు దుద్దులు పెట్టుకుని సంబరంగా నా ముందుకు వచ్చి "బాగున్నాయా అమ్మగారూ!" అంది. ఆ దుద్దులకంటే దాని ముఖంలో సంబరం బాగుంది నాకు. చామనఛాయ కంటే తక్కువగా వుండే నల్లని ఛాయతో పనీపాటలతో బండ దేరిన ఆ ముఖంలో ఎంత సంతోషం • ఎంత సంతృప్తి ? ఎంతటి అల్పసంతోషి ఈ కష్టజీవి!

"మా అమ్మగారు చాలా మంచివారు!" దుద్దులు చేత్తో సంతృప్తిగా తడిమి చూసుకుంటూ అంది నరసమ్మ.


వెర్రిబాగులది! ఆ దుద్దులు నేనేదో ఊరికే ఇచ్చినట్లు పొంగిపోతోంది! ఎంత చేయించుకుని ఇచ్చాను, ఆ చిన్న దుద్దుల జత! దానికా పరిజ్ఞానమే లేదు.

ఆ మధ్య నాకు జ్వరం వచ్చింది. మొదట మామూలు జ్వరమే అనుకున్నాను. కానీ డాక్టర్ టయిఫాయిడ్ అని తేల్చాడు. హడలిపోయాను. నిజం చెపుతున్నాను, నేను హడలిపోయింది చచ్చిపోతానేమోనని కాదు. జబ్బు తగ్గి అనాకారితనం ఏర్పడితే ఎలా బ్రతకాలా ? అని.

ఒక ప్రక్క జ్వరంతో శరీరం కాలిపోతోంటే "నరసమ్మా! రక్తంపోయి నా ముఖం పాలిపోతుందేమో ? జుట్టు ఊడిపోయి నుదుటి మీద అసహ్యంగా కనిపిస్తుందేమో ? బలహీనంతో చిక్కిపోవటంవల్ల చర్మం వదులుగా వేలాడుతున్నట్లు అయిపోతుందేమో." అని భయంతో బాధపడేదాన్ని. పాపం నరసమ్మ నన్ను అనేక విధాల ఓదార్చేది. 'మీ కెందుకమ్మా! ఈ మాయదారి జ్వరం తగ్గిపోనియ్యండి. ఒక్క వారం రోజుల్లో మిమ్మల్ని ఇదివరకు కంటే రెట్టింపు అందచందాలతో తయారుచేస్తాను' అనేది.

డాక్టర్ మంచంమీదనుంచి కదలకూడదని చెపితే, ఏమాత్రం చీదరించుకోకుండా, మలమూత్రాదులు సహితము ఎత్తిపోసింది. తలలో దువ్వెన పెట్టకూడదని చేతివేళ్ళతోనే చిక్కులు తీసి ఏదో ఆయుర్వేద తైలం రాసి జడవేసేది. స్నానం లేకపోవటంవల్ల నా కెంత చిరాగ్గా ఉంటుందో తెలుసుకుని ఉడుకు లాంలో బట్టముంచి, శరీరమంతా తుడిచి యార్డ్లీ పౌడర్ జల్లేది. నేను వద్దు వద్దంటున్నా దెబ్బలాడి పళ్ళరసాలు తాగించేది.

మధ్యలో మా బాస్ రెండుసార్లు ఫోన్‌చేసి ఎంతో అభిమానంగా "ఎలా ఉంద"ని అడిగాడు. ఆ అభిమానానికి నేను ఆనందించే లోపలే "నువ్వు లేకపోతే ఎలాగైనా వెలితిగానే ఉంది. మిగిలినవాళ్ళు ఉన్నారు కాని, నీ అంత ఏక్టివ్‌గా ఉండరు. ఎట్రాక్టివ్‌గానూ ఉండరు" అని నవ్వి ఫోన్ పెట్టేశాడు.




మనసంతా చేదుగా అయిపోయినా నా అందం కాపాడుకోవాలనే ఆరాటం మరింత ఎక్కువయింది. నరసమ్మ ఎంతగా సంరక్షణ చేసినా జ్వరం తగ్గి అద్దంలో నన్ను నేను చూసుకుని అదిరిపడ్డాను. నా కళ్ళముందు కనిపిస్తున్నది ఒక అస్థి పంజరం. కళాకాంతిలేని కళ్ళు, లోతుకుపోయిన చెక్కిళ్ళు....

నలభయి అయిదు రోజులు మంచంలో ఉండేసరికి ఎలా తయారయి పోయాను నేను? ఇదా మానవ శరీరం? ఈ సౌందర్యాన్ని చూసుకునా గర్వ పడుతున్నాను నేను? ఆ సౌందర్యమా నా బ్రతుకు మొత్తానికి ఆధారం. ఈ లోకంలో నా విలువకు గీటురాయి?

అప్రయత్నంగా నా కళ్ళు వర్షించాయి. ఏవో రెండు చేతులు నా కళ్ళు తుడిచాయి. ఎదురుగా నన్ను సానుభూతితో చూస్తూ నరసమ్మ-

“ఏడవకండమ్మగారు! మీ కెందుకు? ఒక్క వారం దినాలు ఓపిక పట్టండి. ఎట్టా తయారయిపోతారో!” ధైర్యం చెపుతున్నట్టుగా అంది. నేను నవ్వి కళ్ళు తుడుచుకున్నాను. నేను ఎందుకు ఏడుస్తున్నానో దానికి వివరించడానికి ప్రయత్నించలేదు నేను. నాకు తెలిస్తే కదా దానికి వివరించటానికి? అప్పుడప్పుడూ మేమూ వున్నామంటూ వస్తాయి, ఆ కన్నీళ్ళు. వీటికి అర్థంపర్థం లేదు.

ఆనాటి నుంచీ నరసమ్మ నాకు నిజంగానే తెగ సంరక్షణ చేసేది. దానికి చిట్కా వైద్యాలు చాలా తెలుసు. పాలమీగడలో నిమ్మకాయరసం కలిపి శరీర మంతా రాసేది. పచ్చిపసుపుకొమ్ము సానమీద అరగదీసి ఆ ముద్దతో నలుగు

పెట్టేది. అదేదో ఆకులతో తయారుచేసిన తైలం తెచ్చి తలమీద మృదువుగా అంటేది. దాని సంరక్షణల ఫలితమో, లేక నేను తీసుకున్న జాగ్రత్తవల్లనో నిజంగానే వారం రోజుల్లో నేను బాగా కోలుకోగలిగాను. మా బాస్ నన్ను ప్రశంసతో చూస్తూ 'వండర్ ఫుల్! ఎక్కడా జబ్బుపడిన మనిషిలాగే లేవు. మరి కాస్త బాగున్నావు' అన్నాడు- ఆ మాటలకు ప్రీమితపడ్డాను.


జ్వరంలో నాకు సేవచేసినందుకు నరసమ్మకు జీతం ఎక్కువ చేశాను. కానీ, అది నాపట్ల చూపిన ఆదరాభిమానాలకు జీతం ఇయ్యటంతో ఋణం తీర్చుకో లేననపించింది. మార్వాడీవాడు, తన దుద్దులు కాజేసిన కథ చెపుతూ 'ఈ జన్మలో నేను మళ్ళీ దుద్దులు పెట్టుకుంటానో లేదో?' అని నిట్టూర్చటం నాకు బాగా గుర్తుంది. అంచేత నేను కోలుకుని యథాప్రకారం బాస్ ఇన్‌స్ట్రక్షన్స్ అనుసరించి 'డ్యూటీ'కి వెళ్ళరాగానే ఆ డబ్బులో కొంత పెట్టి దానికి దుద్దులు కొన్నాను. దుద్దులు చూసుకుని, మురిసిపోతున్న దానితో యధాలాపంగా, 'నరసమ్మా! నీ కిన్ని చిట్కావైద్యాలు తెలుసుకదా నువ్వెందుకు వాడవు?' అన్నాను. అది పరమ నిర్లిప్తంగా 'నా కెందుకమ్మా అందాలు! అంత డబ్బు నే నెట్టా దండగ పెడతాను. నలుగురు బిడ్డలు, బంగారముంటే అక్కర కొస్తాది' అంది.

గతుక్కుమన్నాను. దుద్దులు చూసుకుని అది మురిసిపోతున్నది వాటి అందానికి కాదు, అవి అక్కరకొస్తాయని....

ఆ రోజు నరసమ్మ గోడు గోడున ఏడుస్తూ వచ్చింది. ఎంతటి నిరాశలోనయినా నవ్వుతూ ఉత్సాహం తెచ్చిపెట్టుకునే అది అంతలా ఏడుస్తోంటే చూడలేక "ఏం జరిగిందే?" అని అడిగాను.

"పాపిష్టిదాన్ని. బిడ్డల నోరుకొట్టి అడి క్యార్డులో కట్టానమ్మా. దొంగసచ్చి నోడు ఆ డబ్బంతా పోగేసుకుని ఎక్కడికో పారిపోయాడు- ఒకటీ రెండూ కాదమ్మా! మూడొందల ఇరవయొక్క రూపాయీ ముప్పైయయిదు పైస....లు" గుండెబాదుకుంటూ చెప్పింది. నివ్వెరపోయాను.

పాపం బిడ్డలను ప్రాణంగా పెంచుకుంటూ కూడా వాళ్ళను పిప్పరమెంట్లు కూడా కొనుక్కోనియ్యకుండా స్టీల్ సామానుమీది ఆశతో నయాపైసల దగ్గర నుంచీ ఆ కార్డులో జమకట్టింది. 'అమ్మా నాకు అమ్మగారు తినేలాటి పొడుగాటి స్టీల్ కంచం కావాలి' అంటూ వదలలేక తనదగ్గరున్న పదిపైసలూ తల్లిచేతిలో పెట్టిన లక్ష్మి ముఖమూ, 'నాకు పలకల గ్లాసు కావాలి' అంటూ అమాయకంగా




తన అయిదు పైసలూ ధారపోస్తున్న కిట్టుగాడి ముఖమూ నా కళ్ళముందు కది లాయి. నాకే కళ్ళల్లో నీళ్ళు తిరుగుతోంటే పాపం నరసమ్మ కెలా ఉంటుందో ఊహించగలను.

"అమ్మగారూ మీరు పోలీసోళ్ళతో చెప్పి ఎట్లయినా నా పైసలు ఇప్పించాలి" అని గభాలున నా కాళ్ళు పట్టుకుంది నరసమ్మ. ఇదివరలో ఒకసారి అది మరొక పనిమనిషితో పోట్లాట పెట్టుకుని ఉద్రేకాలు పెరిగి సిగపట్ల కలాపం దాకా వచ్చి, ఇది పోలీస్‌స్టేషన్‌లోనే కూర్చోవలసి వచ్చినపుడు నేను కలగ జేసుకుని విడిపించాను. అప్పటినుండే ఆ అమాయకురాలు నేను అఘటనా ఘటన సమర్థురాలుననీ ఏ చిక్కులలో నుండయినా తనను తప్పించగలననీ నమ్ముతోంది.

"అలాగే ప్రయత్నిస్తాను" అన్నాను.

అది గంపంత ముఖం చేసుకుని "ఆ దరిద్రుడికి బాగా బుద్ధి చెప్పండమ్మా. జన్మలో మళ్ళీ ఇల్లాంటి పాడుపనులు చేయకుండా గడ్డి తినిపించండి" అంది.

నేను నా 'డ్యూటీ'లో తరచుగా ఇద్దరు ముగ్గురు పోలీసు అఫీసర్లను కలుసు కునేదానిని. ఒక పోలీసు ఆఫీసర్‌గారికి ఫోన్‌చేసి జరిగిందంతా వివరించి మా పనిమనిషికి అన్యాయం జరక్కుండా చూడమన్నాను. ఆయన "అలాగే!" అని భరోసా ఇస్తూ నన్నడిగి వివరాలన్నీ తీసుకున్నారు. ఆ తరువాత నాలుగు రోజులకే ఆయన నాకు ఫోన్ చేశారు.

"సారీ! మీరు చెప్పిన విషయంలో నే నేమీ చెయ్యలేను."

"అదేం? ఆ వ్యక్తి ఎవరో తెలుసుకోలేకపోయారా!"

"కాదు? తెలుసుకున్నాను కనుకనే!"

"అంటే?"

"మీకు చెప్పినా ఫరవాలేదు. మనం మనం అంటే ఒకటే? ఆ మోసం చేసిన వ్యక్తి మీ బాస్."

"ఏమన్నారు?"

"అంత ఆశ్చర్యపోకండి. మీ బాస్ అంటే డైరెక్టుగా ఆయన కాదు. ఆయన మేనేజ్ చేస్తున్న బ్రాంచెస్‌లో ఇదొకటి! ఇలాంటి వెన్ని లేకపోతే ఆయన అంత గొప్పవాడయ్యాడు? మమ్మల్ని ఎందుకు మేపుతున్నాడను కున్నారు మరి? ఆయనకు అంగరక్షకులం గనుకనే మీలాంటి అందాలు మాకు విందుగా లభిస్తున్నాయి. సరే! ఇదంతా మరిచిపొండి. మీరూ ఏం చేయలేరు జాగ్రత్త! ఎందుకంటే మీరూ ఇందులో ఒక భాగమే!"

అవతలివైపున ఫోన్ పెట్టేసినా జడప్రాయంగా ఎంతోసేపు కూచుండి పోయాను.

"అమ్మగారూ!" నా భుజాలుపట్టి గట్టిగా వూపుతోంది నరసమ్మ. అయో మయంగా దానివంక చూశాను.

"అదేంటమ్మగారూ? అట్టా అయిపోయారు? నాకు గుండెలు ఝల్లు మన్నాయి." నా గురించిన ఆందోళనతో దాని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆ కన్నీళ్ళు చూసి నాకు కన్నీళ్ళు వచ్చాయి. చాలా అరుదుగా, అపురూపంగా వచ్చే కన్నీళ్ళు!

నా పర్సులోంచి మూడువందలు దానికిచ్చి "ఇది తీసుకోవే! ఇంతకంటే నేనేం చేయలేను" అన్నాను.

అది సంకోచంగా "మీ డబ్బు ఎందుకమ్మా? ఇప్పటికే మీకు చాలా ఋణపడి ఉన్నాను." అంది.

"లేదు! లేదు! నరసా! నువ్వు నా కేమీ ఋణపడి లేవు. వొళ్ళువంచి చాకిరీచేసి కష్టానికి ఫలితం తీసుకున్నావు. నేనే నీకు ఋణపడి ఉన్నాను. ఈ ఋణాల కన్నింటికీ పరిహారం చెల్లించుకునే రోజు ఈ దేశ చరిత్రలో వస్తుందో? రాదో?"

నా మాటలు పాపం అమాయకపు నరసమ్మకి అర్థంకావు. అయోమయంగా నా వంక చూసింది.

———